కథ

# రహదారి బంగళా చింతచెట్టు

**వాణిశ్రీ**

రంగనాథం పార్కులోకి వస్తున్న విశ్వాన్ని చూసి "రావోయ్! రా!" అన్నాడు.

రంగనాథం సెంట్రల్ గవర్నమెంట్ జాబ్‌లోను, విశ్వం స్టేట్ గవర్నమెంట్ వుద్యోగం చేసి రిటైరయ్యారు. రోజూ సాయంకాలం పార్కులో కలుసుకుని కాలక్షేపం చేస్తుంటారు.

"ఏమిటి విశేషాలు?" అడిగాడు రంగనాథం.

"ఏవుంది? ఎండలు మండిపోతున్నాయ్!" అని నవ్వాడు విశ్వం.

"అది మామూలేగా? చలికాలం పోయి ఎండాకాలం, ఆ తర్వాత వర్షాకాలం వస్తుంది"

"ఈరోజు పేపరు చూశావా? సేల్స్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్, పదేళ్ళ సర్వీసు, ఎ.సి.బి.వాళ్ళు పట్టుకుంటే ఏభై లక్షలు దొరికాయంట" అన్నాడు విశ్వం.

"పట్టుకుంటే దొరికాయి. పట్టుకోకుండా వదిలేసిన వాళ్ళ దగ్గర ఎన్ని కోట్లు వుండి వుంటాయి? సామాన్యంగా ఎ.సి.బి. వాళ్ళు పట్టుకోరు. ఏ రాజకీయ నాయకుడి అనుచరుడికో, బంధువుకో ఆ జూనియర్ అసిస్టెంట్ లంచం లేకుండా పని చేసి వుండడు. వీడి సంగతి తేలుద్దాం అని పట్టిచ్చివుంటారు"

"అంతేలే? చిన్న వుద్యోగే అంత సంపాదిస్తే ఆఫీసర్లు కోట్లు కొల్లగొడుతున్నారు. మనమూ వున్నాం దేనికి? నలభై ఏళ్ళ సర్వీసు చేసి రిటైరైనా సొంత ఇల్లు కట్టుకోలేకపోయాం. ఇప్పటితరంతో పోలిస్తే మన తరం వాళ్ళట్టి వెధవాయిలేనన్నమాట"

"అదేం కాదులే. అప్పట్లో కూడా చిలక్కొట్టుడు వుండేది. ఐతే ప్రతి కేసులోనూ ఆశించకూడదు. వచ్చే చోట వస్తుంది. రాని చోట వదిలెయ్యాలి. నిజాయితీపరులు లంచాలు ఇవ్వడానికి ఇష్టపడరు. అటువంటి వాళ్ళని పిండాలని చూస్తే ఎదురుదెబ్బలు తగులుతాయి. మా కొలీగ్ అప్పలస్వామి అలాగే దెబ్బతిన్నాడు. అదీ రహదారి బంగళా చింతచెట్టు వ్యవహారంలో. చెప్తే నువ్వు నవ్వుతావు" అన్నాడు రంగనాథం.

"ఐతే నన్ను నవ్వించు" అని నవ్వాడు విశ్వం.

"ఎప్పుడో. నలభై ఏళ్ళ క్రితం సంగతి. 1964లో అనుకుంటాను" అని రంగనాథం మొదలుపెట్టాడు.

హైదరాబాద్ నుంచి బందరు వెళ్ళే దారిలో వుంది సిరిపురం. సిరిపురంలో రహదారి బంగళా వుంది. ఆ కౌంపౌండ్‌లోనే ఆర్ అండ్ బి వారి సెక్షన్ ఆఫీసు వుంది. చాలా పాతది. బందరు రేవుని ఇంగ్లీషు వాళ్ళకి కౌలుకి ఇచ్చిన హైదరాబాద్ నవాబు సిరిపురం మీదుగా బందరు వెళ్ళేవాడనీ, అక్కడ ఈస్టిండియా కంపెనీ దొరలు లండన్ నుంచి తెచ్చిన అపురూపమైన వస్తువులు నవాబుకి బహూకరించే వారనీ, ఆ ప్రయాణంలో వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు నవాబు మందీ మార్బలంతో, గుర్రాలు, ఏనుగులతో సిరిపురంలో మజిలీ చేసేవాడట. నవాబు బంట్లు ఆ చుట్టుపక్కల వూళ్ళల్లో పడి కోళ్ళు, మేకలు, ఆవులు పట్టుకుపోయేవారనీ చెప్పుకుంటారు.

ఇంతకీ కథ ఏమిటంటే ఆ రహదారి బంగళాలో పెద్ద చింతచెట్టు వుంది. శాఖోపశాఖలుగా విస్తరించి చల్లటి నీడనిస్తున్నది. ఆర్ అండ్ బి సెక్షన్లో పనిచేసే జవానులు, గ్యాంగ్‌మేన్‌లు; రోడ్డు గుమాస్తాలు వగైరా సిబ్బంది చింతకాయలు కోసి తలాకాసిని పట్టుకెళ్ళి పచ్చడి పెట్టుకునే వాళ్ళు. అంతేకాకుండా తమపై అధికారులైన అసిస్టెంట్ ఇంజనీరుకి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు దొరగారికీ, వారి కార్యాలయంలో సిబ్బందికీ పంచేవారు.

ఎన్నో ఏళ్ళుగా అలా జరుగుతూ వుంది. ఆ సెక్షన్ ఆఫీసుకి వరదాచారి అనే ఆయన సెక్షన్ ఆఫీసర్‌గా వచ్చాడు. ఆయన చాదస్తులకు పెద్దన్నయ్య అనీ, ప్రతిదీ రూల్స్ ప్రకారం జరగాలంటాడనీ పేరు తెచ్చుకున్నాడు. సెక్షన్లో చార్జి తీసుకున్న దగ్గర్నుంచీ రూల్స్ కొరడా ఝుళిపించి గ్యాంగ్‌మేన్‌లను, రోడ్డు గుమాస్తాలను వెంటపడి తరుముతూ గాడిద చాకిరీ చేయిస్తున్నాడు.

సిరిపురం సెక్షన్లో రోడ్లన్నీ నిగ నిగ లాడిపోతున్నాయి. ఎక్కడ చిన్న గుంట పడినా ప్యాచ్ వర్కులు చేయిస్తూ ఆ ప్రాంత ప్రజల మెప్పుపొందాడు. అయితే అతని క్రింద పనిచేసేవాళ్ళు మాత్రం హిట్లరనీ, ముస్సోలినీ అని, గడ్డివామి కాడ కుక్కనీ తిట్టుకునేవాళ్ళు.

ఇలా జరుగుతూవుండగా చింతకాయల సీజన్ వచ్చి చెట్టు విరగ్గాసింది. చింతకాయలు కోసి అంతా పంచుకోవాలని స్టాఫ్ సన్నాహాలు చేస్తుండగా వరదాచారి అడ్డం తిరిగాడు.

"చింతచెట్టు గవర్నమెంటుది. మనం కోసుకుని తిన డానికి కాదు. రూల్స్ ప్రకారం చెట్టుకాయలు వేలం వేయడం ద్వారా అమ్మి వచ్చిన సొమ్ము ఖజానాలో జమ కట్టాలి" అన్నాడు వరదాచారి.

అలా ఖరాఖండీగా వరదాచారి చెప్పేసరికి అతగాడిని ఆ చింతచెట్టుకే కట్టేసి, చింతబరికెతో బాదాలనిపించింది వారికి.

"వెధవ చింతకాయలు, పావలా పారేస్తే వీసెడొస్తాయి" అని ఎవరికి వారు పళ్ళునూరుకుని సర్దుకున్నారు.

ఏసుపాదంతో సిరిపురం అంతా తిరిగి టముకు వేసి రమ్మన్నాడు వరదాచారి. సెక్షన్ ఆఫీసులో చింతచెట్టుకాయలు వేలం పాట జరిగింది. కూరగాయలు అమ్ముకునే చిల్లర వ్యాపారస్తులు వేలంలో పాల్గొన్నారు. పాట ముప్పై మూడు రూపాయల దగ్గర ఆగింది. గుర్నాథం అనే ఆయన పేర పాట కొట్టేశారు.

వరదాచారి ముప్పై మూడు రూపాయలకు రసీదు ఇచ్చి ఆ డబ్బు ట్రెజరీ ఆఫీసులో ప్రభుత్వ ఖాతాకు జమ చేసి చలానా తీసుకున్నాడు. ఆ చలానా తన పై అధికారి అసిస్టెంట్ ఇంజనీరుకి పంపించాడు.


వరదాచారి అనే త్రాష్టుడు, నికృష్టుడు పి.డబ్ల్యూ.డీలో చెడబుట్టి, ఎక్కడా నిలకడ లేకుండా గ్రౌండ్‌లో ఫుట్‌బాల్‌లా తన్నించుకుంటూ తిరుగుతూ సిరిపురం సెక్షన్ పాలిట పడ్డ సంగతి అందరికీ తెలిసింది.

అసిస్టెంట్ ఇంజనీరు వారి కార్యాలయంలో ఆరోజంతా చింతకాయల చలానా గురించే చర్చ జరిగింది. వరదాచారిలాంటి లోకం పోకడ తెలీని చాదస్తుడు ఒక్కడున్నా డిపార్ట్‌మెంటు మొత్తం సర్వనాశనమేనని తీర్మానిస్తూ, ఆ సంవత్సరం చింతకాయలు డబ్బిచ్చి కొనుక్కుని పచ్చడి పెట్టుకోవాల్సి వచ్చినందుకు బాధపడిపోయారు.

చింతకాయల చలానా అసిస్టెంట్ ఇంజనీరు కార్యాలయం నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వారి డివిజన్ ఆఫీసుకి చేరింది.

మేము డివిజన్ ఆఫీసుకి ఇన్‌స్పెక్షన్ నిమిత్తం వెళ్ళినప్పటికి జరిగిన కథ అది.

రికార్డులు తిరగేస్తూ వుండగా మా అప్పలస్వామి కంట సిరిపురం సెక్షన్ చింతకాయలు వేలం వేసి డబ్బు



జమ చేసిన విషయం పడింది.

"చూడవోయ్ రంగనాథం. ఎన్నడూ లేనిది సెక్షన్లో చింతకాయలు వేలం వేసి డబ్బు జమ చేశారు. బాగానే వుంది. 1964 ముందు సంగతి ఏమిటి? లోగడ అలా ఎందుకు వేలం వెయ్యలేదు. ఆ చింతకాయలు ఎవరు తిన్నారు" అన్నాడు.

నేను నవ్వి "పోనిద్దురూ వెధవ చింతకాయల కేసు" అన్నాను.

"అమ్మమ్మ! అలా పోనిస్తే ఎలా? దీనిమీద పేరా రాస్తాను. కథంతా బైటకు వస్తుంది" అన్నాడు.

నేనెంత చెప్పినా అప్పలస్వామి వినకుండా ఇనస్పెక్షన్ పేరా రాశాడు.

సిరిపురం నుంచి వరదాచారిని పిలిపించారు. జవాబు రాసివ్వమన్నారు.

"నేను ఈ సంవత్సరమే సెక్షన్ ఆఫీసరుగాచార్జి తీసుకున్నాను. లోగడ విషయాలు నాకు తెలియదు. రూల్స్ ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో చింతకాయలు అమ్మించి ఖజానాకు జమ చేశాను" అని వరదాచారి నోట్ రాసిచ్చాడు.

ఈ వ్యవహారమంతా నాకు సిల్లీగా వుంది. చూడవలసిన ఆఫీసు రికార్డులు చచ్చిన శవాల్లా టేబుళ్ళ మీద పేర్చివుండగా చింతకాయల్ని పట్టుకుని వూరేగడ మేమిటని అప్పలస్వామిని నిలదీశాను.

"చింతకాయల్లో నుంచి రూపాయలు పుట్టుకొస్తాయి. నీకేం తెలియదు" అని నా నోర్మూయించాడు అప్పలస్వామి.

అప్పలస్వామి మా హెడ్. ఏం చేస్తాను. అప్పటికీ విడిదింట్లో మగపెళ్ళివారికి, ఆడపిల్ల తరపువారు అడుగులకు మడుగులొత్తినట్లుగా ఆఫీస్ స్టాఫ్ అతిథి మర్యాదలు చేస్తూనే వున్నారు. క్యారేజీలలో భోజనాలు, దోసెల పార్సిళ్ళు, గంట గంటకీ కాఫీలు నైవేద్యంగా సమర్పించుకుంటున్నా అప్పలస్వామి తుమతుమలాడుతూనే వున్నాడు.

ఆఖరికి సెక్షన్‌కి ఇంత అని ఇచ్చుకోమని అప్పలస్వామి సంధి ప్రతిపాదన చేశాడు. ఇనస్పెక్షన్ ఆఖరి రోజున మాకు విందు ఏర్పాటు జరిగింది. తాంబూలంలో దక్షిణ తక్కువైందని అప్పలస్వామి కనిపెట్టి నిలదీశాడు. సిరిపురం సెక్షన్ నుంచి డబ్బు రాలేదు. ఐతే నాకేంటి? అన్నాడు అప్పలస్వామి. ఇ.ఇ.ని భరించమన్నాడు. నాకేం దురద అన్నాడు ఇ.ఇ.

చింతకాయల పేరా డ్రాప్ కాకుండా సాగదీశాడు అప్పలస్వామి.

రంగనాథానికి అడ్డొచ్చిన విశ్వం "ఏంటో ఈ చింతకాయల కథ. ఎంతకీ తేలదేం?" అన్నాడు.

"అదే చెప్తున్నా విను. అప్పలస్వామి నిర్వాకం వల్ల దానిమీద ఎంక్వాయిరీ జరిగింది. 1956 నుంచి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆ సెక్షన్లో ఎవరు ఆఫీసరుగా పనిచేశారో వాళ్ళ మీద యాక్షన్ తీసుకోమని ఎంక్వాయిరీ ఆఫీసర్ని ఆదేశించారు. ఎంక్వాయిరీలో తేలినదేమంటే 1956 నుంచి 1963 వరకు అక్కడ ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లు పని చేశారు. అందులో ఒకాయన రిటైరైపోయాడు. మరొకాయన ప్రమోషన్ మీద అసిస్టెంట్ ఇంజనీర్ అయ్యాడు. దొరికితేనే దొంగ గదా? రిటైరైపోయిన వాడినేం చేసేట్లు? కాబట్టి దొరికిన వాడిని పాతెయ్యమన్నారు. అతని పేరు వెంకటస్వామి" అన్నాడు రంగనాథం.

"ఐతే వెంకటస్వామిని ఏం చేశారు? డిస్మిస్ చేశారా ఏం కొంపదీసి?" అడిగాడు విశ్వం.

"అంత జరగలేదులే. వెంకటస్వామిని సస్పెండ్ చేశారు. అందులో నుంచి బైటపడి తన తప్పులేని ఋజువు చేసుకుని మళ్ళీ పోస్టింగ్ తెచ్చుకోవడానికి నాలుగేళ్ళు పట్టింది"

"అయ్యో! పాపం"

"వెంకటస్వామికి పోస్టింగ్ ఇప్పించడానికి అప్పలస్వామి గూడా తిప్పలు పడ్డాడ్లే!" అన్నాడు రంగనాథం.

"అదేం పాపం? కెలికింది అప్పలస్వామే గదా!"

"ఔను. ఎవడి కొంపకో ఎసరు వస్తుందనుకున్నాడు అప్పలస్వామి. తన కొంపకే వస్తుందనుకోలేదు. ఇంతకీ కొసమెరుపు ఏమిటంటే ఆ వెంకటస్వామి సాక్షాత్తూ అప్పలస్వామి అల్లుడే" అన్నాడు రంగనాథం.

విశ్వం పకపక నవ్వాడు.

○